క్లుప్తంగా

ఘనంగా జాతర



పూజలు చేస్తున్న గ్రామస్తులు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట గ్రామంలో వెలసిన సంత్‌సేవాలాల్ మహారాజ్ మారెమ్మ జాతర సందర్భంగా సోమవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. జాతరను పురస్కరించుకుని ఆలయాన్ని పుష్పాలతో అలంకరించారు.

సొసైటీ చైర్మన్, డైరెక్టర్ల రాజీనామా



సన్మానం అందుకున్న సొసైటీ డైరెక్టర్లు

గడివేముల: గడివేముల సొసైటీ చైర్మన్ చంద్రశేఖరరెడ్డి, డైరెక్టర్లు నంద్యాల వెంకటేశ్వర్లు, రవీంద్రారెడ్డి సోమవారం తమ పదవులకు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను సీఈఓ ఆదినారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు సేవ చేసేందుకు అవకాశం కల్పించిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారిని సొసైటీ సిబ్బంది సన్మానించారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

పాణ్యం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి అదనంగా ట్యాంకర్లను ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నట్లు ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ తెలిపారు. సోమవారం కాలనీలో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ.. కొద్ది రోజులుగా కాలనీలో నీటి సమస్య ఉందని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పెద్దమ్మ గుడి వద్ద ఉన్న బోరులో నీరు తగ్గిపోవడంతోనే నీటి సమస్య నెలకొందన్నారు. ఆమె వెంట ఏఈ మధుశేఖర్, ఈఓఆర్డీ సులోచన, ఈఓ ఆనందరావు ఉన్నారు.

27న గుంటూరులో రాష్ట్ర మహాసభలు

కర్నూలు(హాస్పిటల్): ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 18వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 27వ తేదీన గుంటూరులో నిర్వహించనున్నట్లు ఆ సంఘం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అధ్యక్షుడు బాలునాయక్ అన్నారు. సోమవారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ మహాసభకు వైద్య ఉద్యోగులందరూ కదిలిరావాలని బాలునాయక్ కోరారు. కార్యక్రమంలో సెక్రటరీ ఖాజామొద్దీన్, ట్రెజరర్ సురేష్, యూనియన్ నాయకులు హరిచంద్రనాయుడు, నరసింహులు, సుందర్‌రాజు, రంజిత్, రాజు, మల్లికార్జున, ఉరుకుందయ్య, రమేష్, పరశురాముడు, చెన్నయ్యదాస్, సత్యనారాయణ, నూర్ అహ్మద్, గిరి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

కర్నూలు(సెంట్రల్): ఖరీఫ్ రైతులకు నకిలీ విత్తనాలు సరఫరా చేయకుండా అరికట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కార్మిక, కర్షక భవన్‌లో మాట్లాడుతూ..పత్తి, మొక్కజొన్న, కంది, మిరప, ఉల్లి ఆముదం, కొర్రలు, మినుము రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు సరఫరా చేయాలన్నారు. వెంటనే పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలన్నారు. బ్యాంకుల నుంచి రైతులకు రుణాలు ఇప్పించాలని కోరారు.

డిగ్రీ పరీక్షలకు 91 శాతం హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు 91 శాతం హాజరు నమోదైందని వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఉదయం సెషన్‌లో జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు ముగ్గురు విద్యార్థులకు ముగ్గురు, మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన ఆరో సెమిస్టర్ పరీక్షలకు 1,767 మందికి 1,608 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. తుగ్గలి ఏఎస్ డిగ్రీ కళాశాల, డోన్ వైష్ణవి డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాల్లో ఒక్కొక్కరు చొప్పున ఇద్దరు విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

వైద్య విద్యార్థి మృతికి సంతాపం

కర్నూలు (హాస్పిటల్) : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వైద్య విద్యార్థి తేజేశ్వర్ రెడ్డికి సంతాపంగా సోమవారం వైద్య విద్యార్థులు కర్నూలు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాయంత్రం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య విద్యార్థి తేజేశ్వర్ రెడ్డి మృతికి ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. కళాశాల వద్ద అధికారులు స్పీడ్ బ్రేకర్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి పలువురు వైద్యులు, సిబ్బంది మద్దతు తెలిపారు.

వానా కాలం.. పాములతో భద్రం

- వర్షాకాలంలో పాముల బెడద
- ఏమరపాటుగా ఉంటే ప్రాణాలకే ముప్పు
- పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదాలు
- వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి
- స్థానిక ఆస్పత్రుల్లో అందుబాటులో మందులు

వర్షాకాలంలో పాములు ఎక్కువగా కనిపిస్తుంటాయి. పుట్టలు, పొదల్లోకి వర్షపు నీరు చేరడం వల్ల అవి బయటకు వస్తుంటాయి. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల్లో పాముల బెడద ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పాముకాటుకు గురికాక తప్పదు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను అధిగమించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. అవేంటో చూద్దాం.

గడివేముల: ఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకూ పాములు, ఇతర విష కీటకాల బెడద ఉంటుంది. ముఖ్యంగా పాములు ఎలుకలను, కప్పలను తినేందుకు బయట తిరుగుతూ చెట్ల పొదల్లో ఉంటాయి. అలాంటి సమయంలో అప్రమత్తంగా ఉంటూ ఏదైన ప్రమాదం సంభవించినప్పుడు నిర్లక్ష్యం వహించకూడదు. ముఖ్యంగా పాము కాటేస్తే ఒంటిపై రెండు లేదా నాలుగు కామా ఆకారపు గుర్తులు పడతాయి. అర గంటలోపు విషం ఒళ్లంతా పాకి నాడి వ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. కళ్లు మూతలు పడడం, చేతులు, కాళ్లకు తాత్కాలికంగా పక్షవాతం రావడం, మాట ఆగిపోవడం, నాలుకకు రుచి తెలియకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రక్త పింజరి కరిచిన భాగం ఉబ్బి తీవ్రంగా నొప్పి కలిగిస్తుంది. అర గంటలో నోరు, చెవుల్లోంచి రక్తస్రావం జరుగుతుంది. పాము కాటువేసిన భాగాన్ని ఎక్కువగా కదిలించరాదు. ఆ భాగాన్ని బట్టతో లేదా టవల్‌తో గట్టిగా కట్టాలి. ఇలా చేయడం వల్ల విషం శరీరంలోకి వ్యాపించదు. కట్టును పది నిమిషాలకు ఒకసారి వదిలి మళ్లీ కడుతూ ఉండాలి. పాము కాటు వేసిన చోట కొత్త బ్లేడుతో ప్లస్ గుర్తు మాదిరి ఒక సెంటీమీటర్ లోపలి వరకు కోయాలి. కాసేపటికి విషంతో కూడిన రక్తం దానంతట అదే బయటకు పోతుంది. సాధ్యమైనంత తొందరగా సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళితే విషానికి యాంటీ వీనమ్ తీసుకుంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు. రాత్రి వేళల్లో పొలం వద్దకు వెళ్లే రైతులు శబ్దం చేస్తూ టార్చ్‌లైట్ వెంట తీసుకెళ్లాలి.

అన్ని పాములు ప్రమాదకరం కాదు

మనకు కనిపించే అన్ని పాములు విషపూరితం కాదని వైద్య నిపుణులు అంటున్నారు. నాగుపాము, కట్లపాము, రక్తపింజరి వంటి పాముల వల్లే ప్రమాదం ఉందని చెబుతున్నారు. సాధారణంగా 50 శాతంపైగా పాముల వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని అంటున్నారు. పాము కాటేసిన వెంటనే వైద్యం చేయించుకుంటే ఎలాంటి సమస్య ఉండదు.

రక్తపింజరి : అత్యంత ప్రమాదకర పాముల్లో ఇది ఒకటి. ఎక్కువగా అటవీ ప్రాంతంలో సంచరిస్తుంటుంది. ఈ పాము కాటు వేస్తే క్షణాల్లో రక్తం గడ్డకట్టడం ప్రారంభమవుతుంది. శరీర అవయవాలు పనిచేయడం ఆగిపోతుంది. ఈ పాము కాటువేసిన వెంటనే అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆస్పత్రులకు వెళ్లి వైద్యం పొందాలి.



నాగుపాము : నాగుపాము అత్యంత ప్రమాదకరమైంది. ఈ పాము కాటువేస్తే 15 నిమిషాల్లో విషం ఎక్కుతుందని అంటారు. ముందుగా పాముకాటు వేసిన చోట వెంటనే కట్టుకట్టాలి. కాటుకు గురైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించాలి. నాగుపాము విషం ప్రధానంగా నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

కట్లపాము :కట్లపాము కాటువేసిన వెంటనే విషం రక్తంలో కలుస్తుంది. ప్రాణాపాయం ఎక్కువ. పాము కాటు వేసిన వెంటనే ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించాలి. కట్లపాము విషం రక్తంలోకి చేరకముందే వైద్యం చేయిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంది.

ఈ జాగ్రత్తలు పాటించాలి

- పాముకాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకూడదు. తీవ్రమైన ఒత్తిడికి గురైతే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది.
- పాము కాటువేయగానే గాయాల పైభాగంలో కట్టు కట్టాలి. దీని వల్ల విషం శరీరానికి పాకకుండా నివారించవచ్చు.
- ఏ పాము కాటు వేసిందో తెలుసుకుని యాంటీ వీనమ్ (విషానికి విరుగుడు) తీసుకుంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు.
- రైతులు రాత్రిపూట పొలాలకు వెళ్లేప్పుడు కాళ్లకు చెప్పులు, టార్చిలైట్లతో పాటు శబ్దాలు చేసే పరికరాన్ని వెంట తీసుకుని వెళ్లడం వల్ల పాము కాటు నుంచి రక్షించుకోవచ్చు.

అప్రమత్తంగా ఉండాలి



వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో పొలాలకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. పాము కాటుకు గురైతే వెంటనే స్థానిక ఆస్పత్రులకు తీసుకెళ్లాలి. అన్ని ప్రాథమిక కేంద్రాల్లో యాంటి వీనమ్ మందులు అందుబాటులో ఉన్నాయి. కాటుకు గురైన వ్యక్తి శరీరంలో మార్పులు రాకుండా తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

–డాక్టర్ మొల్లా జబీన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, గడివేముల

పనులపై పూర్తి వివరాలు సమర్పించండి



ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షిస్తున్న అధికారులు

సి.బెళగల్: మండలంలో చేపట్టిన ప్రభుత్వ పనుల సమగ్ర వివరాలను ఇవ్వాలని ఈఓఆర్డీ సందీప్ గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలతో కలిసి ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో 2022 నుంచి జల్‌జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్‌లో చేసిన పనుల వివరాలపై సమగ్ర నివేదికలను అందజేయాలని తెలిపారు. అదే విధంగా గ్రామ పంచాయతీల్లో చేయాల్సిన పనులపై పలు సూచనలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి బోర్లు, పైప్‌లైన్లు డ్రైనేజీ కాలువల మరమ్మతు పనుల వివరాలను అందజేయాలన్నారు. అలాగే నాడు–నేడు పథకంలో జరిగిన అభివృద్ధి పనులు, నిధుల వినియోగం తదితర వివరాలను అందజేయాలని ఆదేశించారు.

మద్యం దుకాణాల ఉద్యోగులకు న్యాయం చేయాలి

గూడూరు రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని సోమవారం ఏపీఎస్‌బీసీఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు జతిన్ చంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2019లో అప్పటి ప్రభుత్వం ప్రైవేట్ మద్యం దుకాణాలను రద్దు చేసి సొంతంగా ఏర్పాటు చేసిందన్నారు. అర్హతను బట్టి ఉద్యోగులను నియమించిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 వేల మంది ఉపాధి పొందుతున్నారన్నారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో ప్రభుత్వం మద్యం దుకాణాలను రద్దు చేసి పాత పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు టెండర్ల ద్వారా ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తుందన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే మద్యం దుకాణాల్లో పని చేస్తున్న 18 వేల కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ విద్యార్హత, సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని మరో డిపార్టుమెంట్‌కు సేవలను వినియోగించుకుని న్యాయం చేయాలని కోరారు.

సారా స్వాధీనం.. ఐదుగురి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న నాటు సారాను చూపుతున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని వెల్దుర్తి మండలం రత్నపల్లెకు చెందిన ఈడిగ వెంకటేష్, వెల్దుర్తికి చెందిన దూల రామచంద్రుడులను సోమవారం అదుపులోకి తీసుకుని 26 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. అలాగే గతంలో నాటుసారా తయారీ కేంద్రాలు నిర్వహిస్తూ పరారీలో ఉన్న వెల్దుర్తి మండలం ఎల్.బండకు చెందిన ఘమికి బాయి, బద్దీబాయి, కర్ణాటక మద్యం తరలింపు కేసులో నిందితుడిగా ఉన్న క్రిష్ణగిరి మండలం సంగాల వాసి నంద్యాల మద్దయ్యలను అదుపులోని తీసుకుని డోన్ కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వెల్లడించారు. దాడుల్లో కర్నూలు స్క్వాడ్ సీఐ నరసానాయుడు, ఎస్ఐ వీరాస్వామి, కోడుమూరు సెబ్ ఎస్ఐ అలీబేగ్ పాల్గొన్నారు.

విద్యుత్ వెలుగుల్లో ప్రభుత్వ భవనాలు



ఎంఈఓ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న డీపీఓ మంజులవాణి

పాణ్యం: ఈ నెల 12వ తేదీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాణ్యం మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. సోమవారం నంద్యాల డీపీఓ మంజువాణి ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ, ఈఓఆర్డీ సులోచన, ఎంఈఓ–2 సుబ్రమణ్యం ఉన్నారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం



మల్లెతోటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

కల్లూరు: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటలు సాగు చేసుకునే రైతులకు ప్రోత్సాహమిస్తామని జిల్లా నీటి యజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ (డ్వామా పీడీ) అమర్నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు మండలం చిన్నటేకూరులో సాగు చేసిన మల్లెతోటను పరిశీలించారు. రైతుతో పంట దిగుబడి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

సి.బెళగల్: స్థానిక మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ వంశీమోహన్ తెలిపారు. విద్యార్థులు తమ ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 14వ తేదీ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని.. మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. 7వ తరగతిలో 65 సీట్లు, 8వ తరగతిలో 52, 9వ తరగతిలో 10 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

గూడూరు రూరల్: పట్టణంలోని పీహెచ్‌సీలో సోమవారం గర్భిణులకు వైద్యాధికారిణి ప్రత్యూష వైద్య పరీక్షలు నిర్వహించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 33 మంది గర్భిణులను ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చి బీపీ, షుగర్, రక్త, తదితర ఆరోగ్య పరీక్షలను చేయించారు. అవసరమైన మందులను అందజేశారు.

విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



విత్తన దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్,



రైతులకు కంది, కొర్ర విత్తనాలను అందజేస్తున్న ఏఓ

కోడుమూరు రూరల్: మండల కేంద్రంలోని విత్తన దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విత్తనాలకు సంబంధించిన స్టాక్ రికార్డులు, లైసెన్స్‌లను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. ప్రతి దుకాణదారుడు వ్యవసాయశాఖ అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని తెలిపారు. విత్తన కొనుగోలు సమయంలో రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. అనుమతి లేని విత్తనాలు, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు లూజు విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయొద్దని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అమ్ముతుంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రైతులకు కొర్ర, కంది విత్తనాలు పంపిణీ

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతు భరోసా కేంద్రాల ద్వారా మంజూరైన కొర్ర, కంది విత్తనాలను ఏఓ రవిప్రకాష్ కోడుమూరు రైతులకు అందజేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వార ఐసిపిల్ 87119 రకం కంది విత్తనాలు కిలో రూ.98, ఎస్ఐఏ 3156 రకం కొర్రలు రూ.44తో రైతులకు అందజేస్తున్నామని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని ఖాళీ స్థలంలో నిలిచిన వర్షపు నీరు,



పార్థసారథి నగర్‌లో బురదమయంగా ఉన్న రోడ్డు

చినుకు పడితే చెరువే!

కల్లూరు: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో కల్లూరు అర్బన్ పరిధిలోని రోడ్లు, వీధులు బురదమయంగా మారాయి. ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి కుంటలను, చెరువులను తలపిస్తున్నాయి. నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని ఖాళీ స్థలంలో వర్షపు నీరు నిలవడంతో చెరువులా కనిపిస్తోంది. పందిపాడు పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో వర్షపు నీరు నిలిచింది.



ఇందిరమ్మ కాలనీలో నిలిచిన నీరు

ఎన్నికల వేళ.. కేసులు ఇలా

- ట్రబుల్ మాంగర్స్‌పై దాదాపు 2,186 కేసులు
- 13 చెక్‌పోస్టుల ద్వారా రూ.8.20 కోట్ల నగదు సీజ్
- 17 వేల లీటర్ల ఎన్‌డీపీఎల్ మద్యం పట్టివేత



అక్రమ రవాణాపై చెక్‌పోస్టులో తనిఖీ నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం (ఫైల్)

కర్నూలు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను పోలీసులు జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించారు. అయితే, ఇందుకోసం వారు ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి పలు చర్యలు తీసుకున్నారు. ప్రధానంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశారు. అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. నిబంధనల ఉల్లంఘనలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి కింద కేసులు నమోదు చేశారు. ఎన్నికల కోడ్‌కు సంబంధించి వచ్చిన ఫిర్యాదులతో పోలీసులు 13 కేసులు నమోదు చేశారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం, నగదు తరలింపు, ఇతర కేసులు కూడా ఎక్కువగానే నమోదయ్యాయి. ట్రబుల్ మాంగర్స్‌పై దాదాపు 2,186 కేసులు నమోదు కాగా, అందులో 5,574 మందిని బైండోవర్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 13 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఎన్నికల సందర్భంగా తనిఖీలు నిర్వహించి రూ.8.20 కోట్ల నగదు పట్టుకున్నారు. అలాగే 17 వేల లీటర్ల ఎన్‌డీపీఎల్ మద్యం పట్టుకుని కేసులు ఫైల్ చేశారు. తనిఖీల్లో రూ.5.15 లక్షలు విలువ చేసే 785.466 గ్రాముల బంగారం, రూ.2.45 లక్షల విలువ చేసే వెండి కూడా పట్టుబడింది. అలాంటి వారిపై 790 ఎఫ్ఐఆర్‌లు, కేసులు నమోదయ్యాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో స్టాటిక్ సర్వలయన్స్ టీమ్స్ 26, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ 32, ఎంసీసీ టీమ్స్ 36 కేసులు నమోదు చేశారు. ఇవన్నీ ఎన్నికల నిబంధనల ఉల్లంఘనల కిందనే నమోదయ్యాయి.

ఆశల సాగు ఆరంభం



పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు



తిరుపాడులో దుక్కు దున్నుతున్న రైతన్న

గడివేముల: ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు కురుస్తుండడంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఎక్కడ చూసినా రైతులు, కూలీలు బిజీబిజీగా కనిపిస్తున్నారు. ఈ ఏడాది తమ పంట పండుతుందనే ఆశతో ముమ్మరంగా వ్యవసాయ పనులు చేస్తున్నారు. మండలంలోని గని, ఎల్‌కే తండా, ఒండుట్ల, చిందుకూరు, బొల్లవరం గ్రామాలు మెట్టప్రాంతం కావడంతో వర్షాధార పంటలనే సాగుచేస్తారు. మెట్ట ప్రాంత రైతులు విత్తనాలు వేయడంతో పాటు వేసిన పంటలకు రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఎంతో మేలు చేస్తాయని వ్యవసాయ అధికారులు అంటున్నారు. మండలంలో 22 వేల ఎకరాల పంటపొలాలు ఉన్నాయి. అందులో ఖరీఫ్‌లో 19వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారని వ్యవసాయాధికారులు తెలిపారు. ముఖ్యంగా మండలంలో పత్తి, మొక్కజొన్న, వరి, మిరప, సోయాబీన్ పంటలను అధికంగా సాగు చేస్తారు.